ప్రజాశక్తి
శనివారం 15 ఫిబ్రవరి 2025





జాతీయ జెండా, అనంత బాలోత్సవం జెండాలను ఆవిష్కరిస్తున్న అతిథి జెఎన్‌టియు విసి సుదర్శనరావు, షమీమ్ షఫీవుల్లా, పద్మజ, సావిత్రి తదితరులు

అదిరే(బా)ల..!

- ఉత్సాహభరితంగా 'అనంత బాలోత్సవం-5' ప్రారంభం
- ఎల్‌కెపిలో పిల్లల సందడే.. సందడి..!
- కట్టిపడేసిన చిన్నారుల నృత్యాలు, నాటికలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన సైన్స్ నమూనాలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు తగ్గని జోష్

చిన్నారుల మోములో ఆనందం వెల్లివిరిసింది.. ఆకాశమే హద్దుగా బాలబాలికలు సందడి చేశారు. మార్కుల వేటలో బందీ అయిన బాల్యానికి కాస్త ఆటవిడుపునిచ్చి నాట్య మయూరాల్లా విహరించారు. పుస్తకాలతో కుస్తీ పట్టిన చిట్టి చేతులు సేదదీరి కేరింతలు కొట్టాయి. నాలుగుగోడల మధ్య నిలిచిన సృజనాత్మకతను వెలికితీసి వారి ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పారు. బుడిబుడి అడుగులతో ఆసాంతం ఆ'బాల'గోపాలోత్సవాన్ని కనులముందు సాక్షాత్కరింపజేశారు. ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటలతో ఆహుతులను సమ్మోహితులను చేశారు. సైన్స్ ప్రదర్శనలతో ఆలోచింపజేస్తూ.. వ్యాసరచన వక్తృత్వ పోటీలతో మొదదుకు పదునుపెట్టారు. 'అనంత బాలోత్సవం-5' వేదికగా వందలాది మంది చిన్నారులు ఆద్యంతం అనంత ముగింట ఇంద్ర ధనస్సును ఆవిష్కరింపజేశారు. అనంతపురం లలిత కళాపరిషత్ వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవాలు-5 శుక్రవారం నాడు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పిల్లల పండుగలో మొదటి రోజు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది విద్యార్థులు, చిన్నారులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు.





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవం-5 పిల్లల పండుగ అనంతపురం నగరంలో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు పిల్లలు ఆటపాటలతో చిందులేయడమే కాకుండా, తమ విజ్ఞానాన్ని ప్రదర్శించే పోటీలు ఆరంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన ఈ పోటీలతో లలిత కళాపరిషత్‌లో ఉత్సహపూరిత వాతావరణం నెలకొంది. జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, జానపద గేయాలు, నృత్యాలు, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం ఊర్రూతలూగించాయి. నాటక ప్రదన్శలు ఆలోచింపజేశాయి. అకడమిక్ విభాగంలో వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, కథా విశ్లేషణ, దినపత్రిక పఠనం, కథ రచన, కవిత రచన, సైన్స్ ఎగ్జిబిషన్, బెస్ట్‌ఫ్రం వేస్ట్, మెమోరీ టెస్ట్, కార్టూన్ పోటీల్లో పోటీల్లో పిల్లలు ప్రతిభ కనబరిచారు. రంగురంగుల దుస్తులతో కొంత మంది విద్యార్థులు విచిత్ర వేషధారణలో రాగా, సాంప్రదాయ దుస్తులైన లంగా వోని వేసుకుని జానపద పాటలు పాడారు. పిల్లల ప్రతిభా పాటవాలను చూసి తల్లిదండ్రులే కాదు అక్కడున్న వారంతా మురిసిపోయారు. తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చేయాలంటూ ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. ఎనిమిది ప్రాంగణాల్లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు.

ఉత్సాహభరిత వాతారవణంలో ప్రారంభం

బాలోత్సవం -5 ఉత్సాహ భరిత వాతావరణంలో లలిత కళాపరిషత్ వేదికగా ప్రారంభం అయ్యింది. అక్కడ ఏర్పాటు చేసిన జాతీయ జెండా, అనంత బాలోత్సవం జెండాలను ముఖ్య అతిథులు జెఎన్‌టియు విసి సుదర్శనరావు, అనంత బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లాలు ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభోత్సవ సభను ఎల్‌కెపి పూర్వ కార్యదర్శులు గాజుల నారాయణస్వామి, ఎ.నరసింహ్మ మూర్తి ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథుల ప్రసంగం అనంతరం చిన్నారుల ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి.

బహుమతులు ప్రదానం

మొదటి రోజుకు సంబంధించి గెలుపొందిన వారికి సాయంత్రం బహుమతులను అందజేశారు. షమీమ్ షఫీఉల్లా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ, అనంత బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్య నిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, జిలాన్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఛైర్మన్ జయంతి, కెనెరా బ్యాంకు మేనేజర్ సెంథిల్ గణేష్, సాయి ట్రస్ట్ ఛైర్మన్ విజయసాయికుమార్, ఎల్‌కెపి ఉపాధ్యక్షులు రామగోవింద సాగర్ తదితరులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, గోవిందరాజులు, లింగమయ్య, నాగేంద్ర, విరూపాక్షి, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, ఎజి.రాజమోహన్, చంద్రిక, రామాంజినమ్మ, శ్యామల, అశ్విని, అరుణమ్మ పాల్గొన్నారు.



అల్లూరి వేషధారణలో ఉన్న కుమారుడి బాలోత్సవానికి వస్తున్న తల్లిదండ్రులు



సైన్స్ నమూనాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు



వివిధ వేషధారణలో చిన్నారులు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి సుదర్శనరావు

విద్యార్థులకు ఎంతో ఉపయోగం
జెఎన్‌టియు విసి సుదర్శనరావు


అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల పండుగ విద్యార్థులు, చిన్నారులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని జెఎన్‌టియు విసి సుదర్శనరావు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆట పాటలు ఎంతో అవసరం అన్నారు. వారిలో దాగున్న సృజనాత్మకత వెలికి తీయడానికి బాలోత్సవం చక్కటి వేదిక అన్నారు.

◆ బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లా మాట్లాడుతూ అనంత బాలోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఏడాదికేడాది రెట్టించిన ఉత్సాహంతో విద్యార్థులు పాల్గొంటూ ఉండడం సంతోషంగా ఉందన్నారు.



మూడు రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలను పిల్లలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడమే గొప్ప అనుభూతి అన్నారు. గెలుపోటములు పక్కన బెట్టి ఇలాంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

◆ 'కుల మతాలు మనకొద్దు... విజ్ఞాన శాస్త్రం ముద్దు.' అని మాజీ ఎమ్మెల్యే డా॥గేయానంద్ బాలోత్సవం వేదిక నుంచి పిల్లలతో చెప్పించి ఉత్సహపరిచారు.



విద్యార్థి తరపున బహుమతి తీసుకుంటున్న ఉపాధ్యాయులు

నిధులివ్వని కేంద్ర బడ్జెట్

అన్ని రంగాలకూ అన్యాయం -వామపక్ష పార్టీ నాయకుల ఆగ్రహం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రం, వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ఎలాంటి నిధులూ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని వామపక్ష పార్టీ నాయకులు విమర్శించారు. నిధుల కేటాయింపులో కేంద్రం చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం నాడు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్రం తీరును నాయకులు ఎండగట్టారు. విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక సదుపాయాలకు కల్పనకు బడ్జెట్లో నిధులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



వార్త 6లో

అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యత

◆ పాఠశాల పిల్లలకు ఉచితంగా కళ్ల అద్దాలు ◆ వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-గార్లదిన్నె

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గార్లదిన్నె మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో శుక్రవారం నాడు పాఠశాల విద్యార్థుల ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఎంపిపి వెంకటనారాయణ, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభుత్వ పాఠవాలల్లో చదివే విద్యార్థులు అందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల మంది పిల్లలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో ఒకేరోజు 90 వేల మందికి కంటి అద్దాలు అందజేశామన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పిల్లల ఆరోగ్య సంరక్షణను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గత ఐదేళ్లలో విద్యా ప్రమాణాలు తగ్గాయని, వాటిలో మార్పు తీసుకువచ్చేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అనేక చర్యలు తీసుకుంటు న్నారని తెలిపారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు స్వయంగా విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఎపిసి శైలజ, ఎంపిటిసి రామ్మోహన్ రెడ్డి, వైద్యశాఖ జెడి అనిల్ కుమార్ నాయక్, ఫిషరీష్ డిడి శ్రీనివాస నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి కంటి అద్దాలను అందిస్తున్న మంత్రి సత్యకుమార్

తొండపాడు ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-గుత్తి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీలను శుక్రవారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఆదిశేషనాయుడు, ఆలయ కార్య నిర్వహణ అధికారి సి.రామాంజనేయులు సమక్షంలో లెక్కించారు. అందులో రూ. 9,40,590 ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి.రంగస్వామిరెడ్డి యాదవ్, డేగ మద్దిలేటి, ఆలయ అర్చకులు, సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని అనగానిదొడ్డి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు శుక్రవారం టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో గురువారం రైతులు కృష్ణయ్య, రంగడు, రామాంజనేయులుకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో గుమ్మనూరు నారాయణ ఆ గ్రామం వెళ్లి ఒక్కో రైతుకి రూ. 10వేల చొప్పున అందజేశారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, నాయకులు చికెన్ శీన, తిమ్మప్ప ఉన్నారు.

స్ఫూర్తినీయుడు దామోదరం సంజీవయ్య

జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



సంజీవయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దళిత కుటుంబంలో పుట్టి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య సేవలు స్ఫూర్తినీయం అని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలియజేశారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ తదితరులు పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలు కలిగిన నాయకుడు దామోదరం సంజీవయ్య అన్నారు. ఆయన పరిపాలన స్ఫూర్తినీయమని తెలిపారు. నీతి, నిజాయితీతో జీవితాంతం ఆయన గడిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఏ.మాలోల, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ తిప్పేస్వామి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బీసీఆర్.దాస్ రాయలసీమ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు హెచ్.అక్కులప్ప, సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సాకే శంకర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.ముత్యాలప్ప, రాష్ట్ర ఉరుముల కళాకారుల అధ్యక్షులు పూలకుంట రాము, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డిడి రాధిక పాల్గొన్నారు.

బ్రిడ్జి మార్పుపై ఎన్‌హెచ్ఎఐ ఆర్‌ఒకి వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాల్‌లో 150-ఎ జాతీయ రహదారిపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ శుక్రవారం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బెంగళూరులోని ఎన్‌హెచ్ఎఐ ప్రాంతీయ కార్యాలయంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ బెంగళూరు ప్రాంతీయ అధికారి బ్రహ్మోకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆర్‌ఒను కలసిన వారిలో ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లి రాజు, టిడిపి మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ఉన్నారు.

రేపు పిడియాట్రిక్ బ్రాంకోస్కోపీపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అకడమిక్ కార్యకలాపాల్లో ఈ నెల 16వ తేదీ పీడియాట్రిక్ బ్రాంకోస్కోపీపై వర్క్‌షావ్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జ్వాలాపురం శ్రీనాథ్ తెలిపారు. నిపుణులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పీడియాట్రిక్ బ్రాంకోస్కోపీపై వివరిస్తారన్నారు. సాయంత్రం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రాక్టికల్ ప్రదర్శన ఉంటుందన్నారు.

18 నుంచి తాగునీటి సరఫరా కార్మికుల నిరవధిక సమ్మె

◆ వేతనాలు ఇచ్చే వరకు సమ్మె ఆగదు ◆ సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి జిల్లా నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు సమ్మెకు సిద్ధం అయ్యారు. ఈ మేరకు ఈ నెల 18 నుంచి సమ్మెలోకి వెళు న్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నగరంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమావేశం నిర్వహించారు. ఇందులో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్మికులు ప్రతిసారి సమ్మె చేస్తేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉందన్నారు. నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి వాటర్ సప్లై స్కీం ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పీఏబీఆర్ డ్యాం, కళ్యాణ్ దుర్గం, రాయదుర్గం, బెలుగుప్ప, పరిగి, హిందూపురం, మడకశిర డివిజన్లో 850 గ్రామాలకు 600 మంది కార్మికులు ఉచితంగా తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. 10 నెలలు వేతనాలు ఇవ్వకపోతే కార్మికుల కుటుంబాల పోషణ ఎలా అన్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలన్నారు. తాము అధికారంలోకి వస్తే ఐదవ తేదీ లోపు ప్రతినెలా వేతనాలు అందించే బాధ్యత తీసుకుంటామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ స్కీంలో పనిచేసే హిందూపురం ప్రాంతంలో 10 నెలలు, అనంతపురం జిల్లాలో ఆరు నెలలు వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. 30 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గత సంవత్సరం 2024 సెప్టెంబర్ నెలలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు కలసి కార్మికుల మధ్య జరిగిన ఒప్పందం అమలు చేయలేదు. కార్మికులకు ఈఎస్ఐ, బోనస్ వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తూ ప్రతి నెలా 5వ తేదీలోపు క్రమం తప్పకుండా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటినీ పూర్తి స్థాయిలో పరిష్కరించేలా స్పష్టమైన హామీని ఇచ్చేంత వరకు సమ్మెను విరమించమన్నారు. ఈ కార్యక్రమంలో తాగునీటి సరఫరా యూనియన్ నాయకులు జి.రాము, నాగరాజు, వన్నూరు స్వామి, సోము, లోకేష్, మురళి, నాగేంద్ర, రామాంజనేయులు, నరేష్, నంది, వన్నూరప్ప, మురళీకృష్ణ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



సమ్మె సన్నాహక కార్యక్రమంలో మాట్లాడుతున్న జి.ఓబులు

ప్రతి రైతుకూ యూనిక్ ఐడి తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాలో భూమి ఉన్న ప్రతి రైతుకూ యూనిక్ ఐడి (విశిష్ట గుర్తింపు సంఖ్య) తప్పని సరి అని జిల్లా వ్యవసాయధికారి ఉమామహేశ్వరమ్మ తెలియజేశారు. శుక్రవారం ఆమె మండలంలోని బి.కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ యూనిక్ నెంబర్ కోసం రైతు సేవ కేంద్ర ఇన్‌ఛార్జిని కలిసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు పొందడానికి ఈ యూనిక్ నెంబర్ ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి శ్యాం సుందర్ రెడ్డి, పట్టు పరిశ్రమ సహాయకుడు రమాకాంత్, బహుళార్థ విస్తరణ అధికారి చౌడేశ్వరి రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, లేనిచో వారి పక్షాన ఆందోళనలు చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధి తులు లక్షలాది మంది ఉన్నారని, వారికి న్యాయం చేయడంలో 11 ఏళ్లుగా ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. గత ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 900 కోట్ల నిధులను అర్థాంతరంగా నిలిపేసిం దన్నారు. కూటమి ప్రభుత్వమైనా అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి తద్వారా బాధితులకు న్యాయం చేయాలన్నారు. వారి సమస్యలపై జరగబోయే శాసనసభ సమావేశాల్లో చర్చించాలన్నారు. అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ జగనన్న కాకుండా కులగణన చేపట్టాలని, అప్పుడే ప్రతి కులానికి సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నిధులివ్వని కేంద్ర బడ్జెట్

అన్ని రంగాలకూ అన్యాయం.. వామపక్ష పార్టీ నాయకుల ఆగ్రహం

జిల్లా వ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో అనంతపురం క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, ఎస్‌యుసిఐల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నాగరాజు, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు పాల్గొని మాట్లాడారు. ఇటీవల నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలను విస్మరించి సంపన్నులకు రాయితీలు ఇచ్చారన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గతేడాదికంటే తగ్గించారన్నారు. కార్మికుల, రైతుల అభివృద్ధికి కేటాయింపులు లేవన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించి, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలని కోరారు. ప్రభుత్వరంగ ప్రవేటీకరణ చర్యలు, ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలన్నారు. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌ఐలను ఉపసంహరించాలన్నారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలన్నారు. సామాజిక పింఛన్లకు సంబంధించి కేంద్ర కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో 3శాతానికి పెంచాలన్నారు. విద్యా రంగానికి జిడిపిలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాల్సి ఉందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేలా ఆహార సబ్సిడీని పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులను పెంచాల్సి ఉందన్నారు. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులు, సర్‌ఛార్జీలను రద్దు చేయాలన్నారు. కేంద్రం వీటన్నింటినీ పరిశీలించి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వై.వెంకటనారాయణ, ఆర్‌వి.నాయుడు, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, రమణ పాల్గొన్నారు.


గుత్తిలో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

17న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

గుత్తి : కేంద్రం బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేసిందని వామపక్ష పార్టీల నాయకులు వి.నిర్మల, జి.రామదాసు విమర్శించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్రం బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేయడం పట్ల ఈ నెల 17వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కు పిలుపునిచ్చామని, అందులో కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల అధ్యక్షురాలు ఆర్ఎన్.కవిత, వ్యకాసం నాయకురాలు రేవతి, షఫీ, మాబున్ని పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

రాయదుర్గం : కేంద్ర బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం ఎపికి చేసిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఎపికి ఇచ్చిన హామీల అమలుపై బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. దీనిపై కూటమిలో భాగస్వాములుగా ఉన్న టిడిపి, జనసేన పార్టీలు నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్నారు.

పేదలకు స్థలాలిచ్చి పక్కాగృహాలు నిర్మించాలి

శింగనమల : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని పి.జలాలపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో చాలామంది పేదలు సొంతిల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో 3 సెంట్లు , పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున నివాసయోగ్యమైన ప్రదేశంలో పేదలకు స్థలం కేటాయించాలన్నారు. అలాగే గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలతో పాటు కంకర, సిమెంట్, ఇసుము ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధుయాదవ్, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చేనేత మధు, బుశప్ప, మంచాల నాగన్న, ఆంజనేయులు, ఆదిలక్ష్మి, తిరుపాలమ్మ, అమరావతి, అశ్విని, కుమారి, నాగమ్మ, గంగాభవాని, భాగ్యమ్మ, వీరనాగమ్మ, పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకండి

బ్రహ్మసముద్రం : మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలని ఎంఇఒ ఓబులపతి తెలిపారు. స్థానిక ఎంఆర్‌సిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బోధనలో మెరుగుపరచడం, గుణాత్మక విద్య, తదితర అంశాలపై ఉపాధ్యాయులకు సమావేశం ఉంటుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పాఠశాల విధులు నిర్వర్తించి, మధ్యాహ్నం నుంచి కాంప్లెక్స్ సమావేశాలకు తప్పక హాజరు కావాలన్నారు. మండల వ్యాప్తంగా 263 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

సేవాఘడ్‌ను దర్శించుకున్న మంత్రులు

ప్రజాశక్తి-గుత్తి


బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని శుక్రవారం మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్, ఏపి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు జి.వెంకటశివుడుయాదవ్ సందర్శించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ సేవాలాల్‌ను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వారు సంత్ సేవాలాల్, మాతా జగదాంబదేవి ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ట్రస్ట్ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంత్యుత్సవాలు పురస్కరించుకొని ఆలయంలో తెల్లవారుజామున నుంచి అర్చకులు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, సేవాలాల్ మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఆలయం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, తహశీల్దార్ డి.ఓబులేసు, ఎంపీడీవో ప్రభాకర్‌నాయక్, ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, కార్యదర్శి అశ్వర్థనాయక్, కోశాధికారి రవీంద్రనాయక్, భూక్యా వెంకటరమణనాయక్, తదితరులు పాల్గొన్నారు.


సేవాఘడ్ ఆలయంలో సంత్‌సేవాలాల్ మహారాజ్‌ను దర్శించుకుంటున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్

స్కేటింగ్‌లో 'శ్రీచైతన్య' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న అమీనా తాజ్ అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చాటింది. అమీనా ఈ నెల 8, 9 తేదీల్లో మహారాష్ట్రలో జరిగిన అండర్–7 స్కేటింగ్ పోటీ ల్లో కాంస్యం, రజత పతకాలు సాధించడంతో శుక్రవారం పాఠశాలలో ఎజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, ప్రైమరీ జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ పూజ, డీన్ గంగాధర, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జులు దీప, బత్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పథకాలతో అమీనా తాజ్


పాములాయి బ్రాంచిలో అవగాహన సదస్సు

అనంతపురం రూరల్ పరిధిలోని పాములాయి గ్రామం వద్ద ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి, రూరల్ సిఐ ఎన్.శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిఐ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువు ప్రాముఖ్యత, క్రమశిక్షణతో కూడిన జీవితం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలంటే ఉన్నత విలువలు పాటించాలని సూచించారు. సదస్సులో రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్ జయకర్, ప్రిన్సిపల్స్ సమీనాఖాన్, విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపల్ కరీముల్లా, డీన్‌లు చిన్నబాబు, గంగాధర్, ఈశ్వర్‌రెడ్డి, ఏవోలు గోపాల్, రాఘవ రెడ్డి, పోలీసు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుత్తి

'ప్రాణం ఉన్నంత వరకూ అండగా ఉంటా.. వైసిపి కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దు' అని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో 4 నెలలుగా హైదరాబాద్‌లో ఉండి ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం పూర్తిగా కోలుకొని నియోజకవర్గానికి వచ్చిన వైవిఆర్‌కు శుక్రవారం జిల్లా సరిహద్దులో వైసిపి పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. బాట సుంకలమ్మ ఆలయంలో వైవిఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో వైవిఆర్, మధుసూదన్‌రెడ్డి జి.గంగరాజు యాదవ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి వస్తుండగా వారి ముందు భాగంలో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గాంధీ కూడలిలో వైవిఆర్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తేవాలన్నారు. గుత్తి, పామిడి, గుంతకల్లు మండలాల నుంచి వైసిపి శ్రేణులు పెద్దఎత్తున తరలిరాగా మధుసూదన్‌రెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, బి.రాజ కుమార్‌రెడ్డి, బి.రమేష్‌రెడ్డి, జీపు రమణ, వై.రామసుబ్బారెడ్డి, కౌన్సిలర్లు ఫారుక్, వరద, వాల్మీకి శివ, తదితరులు పాల్గొన్నారు.


వైసిపి శ్రేణులకు అభివాదం చేస్తున్న వైవిఆర్

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో ఖాళీ స్థలాల్లో చెత్త వేసే వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని, అయినా హోటళ్ల నిర్వాహకులు పద్ధతి మార్చుకోకపోతే లైసెన్స్ రద్దు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి. బాలస్వామి ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వేకువజామున పారిశుధ్య పనులను పరిశీలించారు. విధుల పట్ల జాప్యం వహిస్తే చర్యలు తప్పవని పారిశుధ్య కార్యదర్శులను హెచ్చరించారు. గుత్తి రోడ్డులో అన్న క్యాంటీన్‌ను పరిశీలించి నిర్వహణ, జాగ్రత్తలపై ఆరా తీశారు. కంప్యూటర్ మానిటర్ పని చేయట్లేదని తెలుపగా మరమ్మతులు చేయించాలని డిఈ సత్యానారాయణను ఆదేశించారు. సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని, అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం శ్రీనగర్‌కాలనీలో నీరు–ప్రగతి పార్కును సందర్శించి పరిశుభ్రంగా ఉంచుతూ, అన్ని వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్ని పార్కులను పూర్తిగా అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవాలని, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాసేపు వాకర్స్‌తో ముచ్చటించారు. ఆయన వెంట డీఈ సుబాష్, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి విష్ణుమూర్తి, ఈఈ షాకీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

లింగ వివక్షకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-ఉరవకొండ

లింగ వివక్షకు పాల్పడితే చర్యలు తప్పవని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ,హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్ వైద్య సిబ్బంది సూచించారు. లింగవివక్ష, పిసిపి ఎన్‌డిటి చట్టం, భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమాలపై శుక్రవారం మండలంలోని రాకెట్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ లింగవివక్ష సరికాదని, ఆడ, మగ పిల్లలిద్దరూ సమానమనే అని వివరించారు. గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించడం, భ్రూణ హత్యలు పాల్పడితే రూ. 10 వేల జరిమానా, జైలు శిక్ష తప్పవన్నారు. అలాగే బాల్యవివాహం చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ ముకుంద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

అనంతపురం : ప్రజలు, విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ సిఐ శ్రీకాంత్‌యాదవ్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ బిఇడిలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్‌లో పోలీస్‌స్టేషన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాల్లో మోస పోతే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ప్రజలు మోసపూరిత ప్రకటనలు, సందేశాలు పంపే సైబర్ నేరస్తుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సిఐ జయానాయక్ సూచించారు. సైబర్ నేరాలపై మండలంలోని ఆవులదట్ల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సిఐ అవగాహన కల్పించారు.

వైసిపి మండల కన్వీనర్‌కు సన్మానం

బ్రహ్మసముద్రం : వైసిపి మండల నూతన కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని శుక్రవారం ముద్దలాపురం వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ముద్దలాపురం వైసిపి నాయకులు, కార్యకర్తలు మండలంలోని పాలవెంకటాపురం గ్రామం వెళ్లి ఆయన నివాసంలో పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని పూలమాలలు, శాలు వాలతో సత్కరించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, అందరి సహకారంతో మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, పెద్ద ఆంజనేయులు, చంద్రన్న, సిద్ధప్ప, మహేష్, ముంగారు రవి, లింగన్న పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ ఉమామహేష్, సిబ్బంది వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం డయాలసిస్ బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రశాంతి, శ్రీనివాసరెడ్డి, లావణ్య, కోఆప్షన్ సభ్యులు నజీర్, వైసిపి నాయకులు పొరాలు శివ, నిజాముద్దీన్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శప్రాయమని నగర మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్ రెడ్డి, కమిషనర్ బాలస్వామి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మేయర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన సంజీవయ్య స్వశక్తితో ఉన్నత స్థాయికి చేరారన్నారు. ఉన్నత చదువులు చదివి రాజకీయాల్లోకి వచ్చి 38 ఏళ్లకే సిఎం అయ్యారన్నారు. వృద్ధాప్య పింఛను పథకం రూపకర్త సంజీవయ్య అన్నారు. కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, ఎస్ఈ భాస్కర్‌రావు, కార్యాలయ సిబ్బంది కార్పొరేటర్లు పాల్గొన్నారు.


దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి

అనంతపురం రూరల్ : నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంజీవయ్య నేటి తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ దామోదరం సంజీవయ్య చిత్ర పటానికి పులమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకటసుబ్బయ్య, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే ధ్యేయంగా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని గుంతకల్లు ఎంవిఐ రాజ బాబు సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కవిత హోటల్ సర్కిల్ వద్ద ఆటో, టాక్సీ, ఇతర డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎంవిఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ తో పాటు వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియ మాలు పాటించాలని సూచించారు. ప్రజలు కూడా ప్రయాణించేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీధర్ అధ్యక్షతన విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్టీవో రమేష్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ లహరి హాజరై హెల్మెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.


జనసేనపార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేస్తున్న నగర అధ్యక్షులు పొదిలి బాబురావు

జనసేన నగర అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి-అనంతపురం

జనసేనపార్టీ నగర అధ్యక్షులు పొదిలి బాబురావు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక రామ్‌నగర్‌లోని ఆయన నివాసం వద్ద బాబు రావు భారీ కేక్ కట చేశారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు బాబురావు ఇంటికి చేరుకుని పూల మొక్కలు, పూలబొకేలు, పూలమాలలు, శాలువాల తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇంటి వద్ద విందు భోజనం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే చొరవతో పైపులైన్ మరమ్మతులు

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురం–తాడిపత్రి మార్గంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల సమయంలో మండలం లోని బండమీదపల్లి గ్రామానికి నీటి సరఫరా చేసే పైపులైన్ దెబ్బతింది. దీంతో బండమీద పల్లిలో నీటి ఎద్దడి ఏర్పడడంతో గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బండమీదపల్లిలో వెంటనే పైపులైన్ మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం అధికారులు ఆ గ్రామం వెళ్లి పైపులైన్ మరమ్మతులు చేయించారు. అలాగే గ్రామంలో ప్రజల తెలుసుకున్నారు. ప్రజల వినతి మేరకు బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంట గ్రామంలో ప్రధాన రహదారిపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు. రాత్రివేళ కూడా స్పీడ్ బ్రేకర్ కనిపించేలా రంగుతో మార్కింగ్ వేయించారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని అధ్యక్షతన ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం గత సంవత్సర కాలంలో ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు రక్షణాత్మక డ్రైవింగ్ ఎలా చేయాలో సూచనలు ఇచ్చారు. రాయదుర్గం డిపో మేనేజర్ జె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మంచి కెఎంపిఎల్ తెస్తూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానా లకు చేర్చాలన్నారు. అనంతరం ఆర్ఎం ట్రైనింగ్‌కు ఇచ్చిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఎంఎఫ్ సుబ్రమణ్యం, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని మడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గ్రామాల్లో పకడ్బందీగా రీసర్వే

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బండీగా చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశించారు. ఆర్డీవో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు దస్త్రాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను ఎంతవరకూ పరిష్కరించారని ఆరా తీశారు. పక్కా ప్రణాళికతో రీసర్వే చేపట్టి రైతుల నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పక్కనున్న వీఆర్వోల సహకారం కూడా తీసుకుని సర్వే చేపట్టాలన్నారు. జాయింట్ ఎల్పీపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉపారాణి, సర్వే డిటి జయమ్మ, ఆర్ఐ లహరిక, సర్వేయర్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్